సాక్షి
వికారాబాద్
ఆదివారం । 30 । జూన్ । 2024



అనుమానమే నిజమైంది

తన తమ్ముడి మరణంపై అనుమానం ఉందని సోదరుడు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగుచూసింది. 8లో▸



పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

వర్షాలు పడుతున్నందున పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలని కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ సూచించారు. 8లో▸



చైర్మన్‌గిరి 'హస్త'గతం

దోమ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ పదవిని అధికార పార్టీ చేజిక్కించుకుంది. 9లో▸

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



అనంతగిరి: జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డి శనివారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్‌కు మొక్కను బహూకరించారు.

ఎల్‌ఓసీ అందజేత



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

బంట్వారం: అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ శనివారం వికారాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో రూ.2,80,000 విలువ చేసే ఎల్‌ఓసీ అందజేశారు. బంట్వారం మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన జీ సురేష్ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. బాధిత కుటుంబానికి స్పీకర్ ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ బర్కత్‌పల్లి నర్సింలు, నాయకులు దర్శనం నర్సింలు, భీమ్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



పరిగి: న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడిగా పరిగి పట్టణానికి చెందిన రంగారం కృష్ణారెడ్డిని జిల్లా కమిటీ సభ్యులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. జిల్లాలోని న్యాయవాదులను సంఘటితం చేసి.. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తూ సంఘాన్ని మరింత పటిష్టం చేస్తామన్నారు. న్యాయవాద వృత్తికి మంచి గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

గ్రామసభలు నిర్వహించాలి

డీపీఓ జయసుధ



తడి, పొడి చెత్త కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ జయసుధ

యాలాల: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో సభలు నిర్వహించాలని డీపీఓ డాక్టర్ జయసుధ ఆదేశించారు. శనివారం మండలంలోని పగిడియాల పంచాయతీని ఆమె సందర్శించారు. గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనం, శ్మశానవాటికలను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. జీపీల్లో విధులు నిర్వహిస్తున్న ఎంపీ డబ్ల్యూ వర్కర్లకు తపాలా బీమా సదుపాయం వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీఓ యాదయ్యను ఆదేశించారు. వర్కర్ల పెండింగ్ వేతనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాదయ్య, కార్యదర్శి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పశ్చిమ ప్రాంతంలోని 17 సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారి శారద శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జంతు శాస్త్రం, వృక్ష శాస్త్రం, అర్థ శాస్త్రం, పౌరశాస్త్రం బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా లైబ్రేరియన్, పీఈటీ, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జూలై 3న ఉదయం 9 గంటలకు మొయినాబాద్ మండలంలోని చిలుకూరు గురుకులంలో జరిగే డెమోకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. అభ్యర్థులు పీజీ, బీఈడీ, జీఎన్‌ఎం, బీపీఈడీ, బీఎల్‌ఐసీ అర్హతలు కలిగి ఉండాలన్నారు.



మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు కోసం సేకరించిన భూమి

ఆగిన మొబిలిటీ వ్యాలీ

ప్రాజెక్టు ఏర్పాటుపై కమ్ముకున్న నీలినీడలు

- జిల్లాలో 1,200 ఎకరాల భూమిని సేకరించిన గత ప్రభుత్వం
- భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లింపు
- పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ
- కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో ముందుకు పడని అడుగులు

వికారాబాద్: వెనుకబడిన జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మొబిలిటీ వ్యాలీకి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం భూ సేకరణ ప్రక్రియను సైతం పూర్తి చేసింది. మోమిన్‌పేట, నవాబుపేట మండలాల్లోని ఎన్కెతల, ఆర్కతల గ్రామాల పరిధిలో 1,200 ఎకరాల భూమి సేకరించారు. రైతులకు పరిహారం కూడా చెల్లించారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోవడం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. జిల్లాలో మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ప్రజలు భావించారు. రాజధానికి కూతవేటు దూరంలో ఉండి కూడా అభివృద్ధికి నోచుకోని వికారాబాద్ జిల్లాకు మొబిలిటీ వ్యాలీ ఒక వరం అవుతుందని అనుకున్నారు. జిల్లాలో ఇదే మొట్టమొదటి పెద్ద ప్రాజెక్టు. ఇది పూర్తయితే ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గత ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్మించ తలపెట్టిన గండిపేట డెవలప్‌మెంట్ అథారిటీ కారిడార్‌లో భాగంగా మొబిలిటీ వ్యాలీని ఏర్పాటు చేసింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన కసరత్తు ప్రారంభించి భూ సేకరణను పూర్తి చేశారు. ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు ఉంటుందా? ఆగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పరిహారంపై అసంతృప్తి

ఏడాది క్రితం పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం రైతుల నుంచి అసైన్డ్ భూములను సేకరించింది. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కూడా చెల్లించారు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న భూముల వాస్తవ ధరలకు ప్రభుత్వం చెల్లించిన ధరకు పొంతన లేదని అన్నదాతలు అసంతృప్తిగా ఉన్నారు. నవాబుపేట మండలంలో ఎకరానికి రూ.16 లక్షల చొప్పున చెల్లించారు. మోమిన్‌పేట మండలంలో ఎకరానికి రూ.17 లక్షలు చెల్లించారు. అయితే ఆ ప్రాంతాల్లో ఎకరా రూ. 50లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నట్లు రైతులు తెలిపారు. మార్కెట్ ధరతో పోలిస్తే సగం కూడా ఇవ్వలేదని వాపోతున్నారు. భూములు ఇచ్చిన రైతులు పరిహారం తక్కువగా వచ్చినా తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు పనులు ప్రారంభం కాకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

రూ.4 వేల కోట్లతో ప్రాజెక్టు

మోమిన్‌పేట, నవాబుపేట మండలాల్లో 1,200 ఎకరాల్లో రూ. 4వేల కోట్లతో మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా వందలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే లక్ష్యం. ఇక్కడ ఎలక్ట్రిక్ వాహనాల విడిభాగాలు తయారు చేసేందుకు ఓ సంస్థ ముందుకు వచ్చింది. పెద్ద ప్రాజెక్టు కావడంతో జిల్లాలోని నవాబుపేట, మోమిన్‌పేట, వికారాబాద్ మండలాలు, రంగారెడ్డి జిల్లా పరిధిలోని శంకర్‌పల్లి, సంగారెడ్డి మండల పరిధిలోని కొండాపూర్ మండలాలు ప్రత్యేక ఆర్థిక మండలిగా రూపాంతరం చెందతాయని భావించారు. కనెక్టివిటీ రోడ్లు కూడా మెరుగుపతాయి. చుట్టు పక్కల మండలాల్లో భూముల విలువలు కూడా పెరగనున్నాయి.

టీఎస్‌ఐఐసీకి భూముల అప్పగింత

నవాబుపేట మండలం ఆర్కతల గ్రామ సర్వే నంబర్లు 12లో 57ఎకరాలు, 32లో 102 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించిన అధికారులు టీఎస్‌ఐఐసీకి అప్పగించారు. ఎకరాకు రూ.16 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. మోమిన్‌పేట మండలం ఎన్కెతల పరిధిలోని 174, 198 సర్వే నెంబర్లలో 900 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా అందులో ఆధ్యాత్మిక సంస్థలు, దివ్యాంగుల సంస్థల కోసం కొంత భూమిని కేటాయించారు. మిగిలిన 536.39 ఎకరాలను టీఎస్‌ఐఐసీకి ఇచ్చేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందులో 380మంది అసైన్డ్ పట్టాదారులు ఉన్నారు. వారికి ఎకరాకు రూ. 17లక్షల చొప్పున చెల్లించారు. భూములు కోల్పోయిన వారికి పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇచ్చేందుకు మొబిలిటీ వ్యాలీ సంస్థ అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

రూ.110 కోట్లతో పర్యాటక అభివృద్ధి

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: పర్యాటక అభివృద్ధి పేదలకు ఉపాధి కల్పించేలా ఉండాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్టేట్ ఛాంబర్‌లో అనంతగిరి పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన పనులపై అటవీ, దేవాదాయ, మిషన్ భగీరథ, భూగర్భ జలం, మున్సిపల్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతిక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పర్యావరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి స్వచ్ఛ దర్శన్ పథకం కింద రూ.110 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో 213 ఎకరాల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళికల రూపొందించారని వివరించారు. పనుల్లో పేదలకు ఉపాధి కలిగేలా చూడాలన్నారు. మొక్కల పెంపకంపై ఎక్కువ దృష్టి సారించాలని ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత మేర ఖర్చు పెడుతున్నారో స్పష్టమైన లెక్కలు ఉండాలన్నారు. గతంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.225 కోట్లు మంజూరైతే కేవలం రూ. 25కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవతో కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీంతో పర్యాటకుల సందడి పెరిగిందన్నారు. స్థానికులకు ఉపాధి లభిస్తోందని తెలిపారు. అనంతరం ఎంపీ కొండా మాట్లాడుతూ.. జిల్లాలోని అనంతగిరులు, కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, శివసాగర్, లక్నాపూర్ ప్రాజెక్టులు, దామగుండం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం పనుల వివరాలను ఎల్‌అండ్‌టీ ప్రాజెక్టు మేనేజర్ సుమతి.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ జిల్లా అధికారి రేణుక, ఈఈ సుందర్, అటవీ శాఖ జిల్లా అధికారి జ్ఞానేశ్వర్, డీవైఎస్‌ఓ హనుమంతరావు, మత్స్య శాఖ అధికారి సౌజన్య, దేవాదాయా శాఖ అధికారి నరేందర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

జిల్లా అభివృద్ధే లక్ష్యం

- రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: జిల్లా అభివృద్ధే లక్ష్యంగా తన శాయశక్తులా పని చేశానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండలంలోని లేమూరు, కందుకూరు, పులిమామిడి, ధన్నారం గ్రామాల్లో రూ.77.79 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ, సీసీ రహదారుల నిర్మాణాలకు శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాధాన్యతా క్రమంలో నిధులను ఆయా మండలాలు, గ్రామాలకు కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కన పెట్టి అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ జంగారెడ్డి, వైస్ ఎంపీపీ శమంత, ఎంపీటీసీలు రాజమ్మ, రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జంగారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మల్లేష్, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కృష్ణనాయక్, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు



మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

శ్యాంప్రసాద్ ఆశయ సాధనకు కృషి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

అనంతగిరి: జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయం ఎదురుగా నాయకులు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒక దేశం.. ఒకే రాజ్యాంగం.. ఒకే ప్రధాని ఉండాలనే నినాదంతో చలో కాశ్మీర్‌కు పిలుపునిచ్చి కాశ్మీర్ జైల్లో బలిదానం చేసుకున్న శ్యాంప్రసాద్ ముఖర్జీ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, సీనియర్ నాయకులు పాండుగౌడ్, రాజేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నందు, శ్రీకాంత్, మహిళా మోర్చా అధ్యక్షురాలు యాస్కి శిరీష, యువ మోర్చా అధ్యక్షుడు సాయిచరణ్‌రెడ్డి, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

అర్హులకే రైతుబంధు ఇవ్వాలి

- అన్నదాతల సూచన
- కొత్తగడి పీఏసీఎస్‌లో అభిప్రాయ సేకరణ
- పాల్గొన్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్



రైతులతో సమావేశమైన వ్యవసాయ శాఖ అధికారులు

అనంతగిరి: అర్హులైన వారికే రైతుబంధు పథకం అమలు చేయాలని అన్నదాతలు సూచించారు. శనివారం వికారాబాద్‌లోని కొత్తగడి పీఏసీఎస్‌లో వ్యవసాయశాఖ జిల్లా అధికారి గోపాల్ ఆధ్వర్యంలో రైతుబంధుపై అన్నదాతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. పంటలు సాగు చేసే రైతులకు మాత్రమే పథకం అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా దానికి ఒక కటాఫ్ తేదీని ప్రకటించాలని కోరారు. సాగు ప్రారంభానికి ముందే తమ ఖాతాల్లో డబ్బు జమ చేయాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా పంట సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, కూలీల అవసరాలకు డబ్బు ఉపయోగపడుతుందని తెలిపారు. సకాలంలో సాయం అందకపోతే అప్పులు చేయాల్సి ఉంటుందని అన్నారు. వికారాబాద్ సొసైటీలో సకాలంలో పంట రుణాలు అందడం లేదని రైతులు తెలిపారు. ఈ విషయంలో కార్యదర్శి పనితీరును తప్పుపట్టారు. అనంతరం ఏడీఏ గోపాల్ మాట్లాడుతూ.. రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ సుభాన్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింలు, ఏఈఓ అనిల్‌కుమార్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా భూముల్లో మళ్లీ అలజడి

- భూసార పరీక్షల కోసమని యంత్రాల బిగింపు
- రైతుల ప్రతిఘటనతో వెనక్కి మళ్లిన అధికారులు



టీఎస్‌ఐఐసీ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్న కుర్మిద్ద రైతులు

యాచారం: ఫార్మా భూముల్లో మళ్లీ అలజడి మొదలైంది. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో భూసార పరీక్షల కోసమంటూ శనివారం టీఎస్‌ఐఐసీ అధికారులు కుర్మిద్ద గ్రామం 311 సర్వే నంబరులోని భూముల్లో పెద్ద, పెద్ద యంత్రాలు దించి బిగిస్తున్నారు. కొంత మంది ఇంజినీరింగ్ సిబ్బందితో డేరాలు వేయిస్తున్నారు. సమీప రైతుల ద్వారా సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. టీఎస్‌ఐఐసీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇదే విషయాన్ని కొందరు ఫోన్ ద్వారా మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కోదండరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే టీఎస్‌ఐఐసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సీరియస్ అయ్యారు. దీంతో అధికారులు యంత్రాలు తీసుకుని వెనక్కి వెళ్లిపోయారు. విషయం నానక్‌నగర్, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని రైతులకు తెలియడంతో వారిలో కూడా ఆందోళన మొదలైంది. ఇదే విషయమై టీఎస్‌ఐఐసీకి చెందిన ఓ ఉన్నతాధికారితో 'సాక్షి' ఫోనులో మాట్లాడితే డ్యూటీలో భాగంగానే అధికారులు అక్కడికి వచ్చినట్లు తెలిపారు.

రైతు రుణమాఫీకి ఆంక్షలుండొద్దు

మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి

ఆమనగల్లు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, రాజేందర్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మిషన్ భగీరథ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీకి ఎలాంటి ఆంక్షలు విధించవద్దని అన్నారు. హైదరాబాద్‌లోని వెంకటేశ్ నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక నాయకులతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలు, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చలు సాగాయి. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

రక్తం ఇచ్చి.. ప్రాణం నిలిపి

తాండూరు: రక్త హీనతతో ప్రసవవేదన అనుభవిస్తున్న గర్భిణికి తాండూరుకు చెందిన వైద్యుడు సంపత్‌కుమార్ రక్తదానం చేసి ప్రాణాలు నిలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్‌కు చెందిన హర్షితకు నెలలు నిండటంతో తాండూరులోని మాతాశిశు ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు రక్తం ఎక్కించాలని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో సంప్రదించగా.. ఆమెకు అవసరమైన గ్రూపు రక్తం అందుబాటులో లేదు. ఏం చేయాలో తోచక సంపత్‌కుమార్‌ను సంప్రదించి సమస్యను వివరించారు. వెంటనే ఆస్పత్రికి వెళ్లిన వైద్యుడు రక్తదానం చేశారు. సంపత్ ఇప్పటికే 158 సార్లు రక్తదానం చేసి రికార్డు సృష్టించారు.



రక్తదానం చేస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్

క్లుప్తంగా

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి

పరిగి: నేరాలు నియంత్రించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటుగా జైలు శిక్ష ఉంటుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ సంతోశ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కను తప్పించబోయి..

- అదుపుతప్పిన బైక్
- పీఏసీఎస్ డైరెక్టర్‌కు గాయాలు



చికిత్స పొందుతున్న నర్సింలు

తాండూరు రూరల్: బైక్ అదుపుతప్పి పీఏసీఎస్ డైరెక్టర్ గాయపడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని రాజీవ్ గృహకల్ప వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన పెండ్యా నర్సింలు ఎల్మకన్నె సహకార సంఘంలో డైరెక్టర్. ఇటీవల పట్టణ శివారులోని మాతా శిశు ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఉదయం ఆయన అంతారం నుంచి ఎల్మకన్నెకు వెళ్తుండగా రాజీవ్ గృహకల్ప సమీపంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పింది. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు నర్సింలును జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

తాండూరు: సారా తయారు చేస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు దాడులు చేశారు.పెద్దేముల్ మండలంలోని పాషాపూర్‌తండా, రాంసింగ్‌తండా, ఓమ్లానాయక్‌తండాలలో సారాయితయారు చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ భాస్కర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు శనివారం సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారులు తాండూరు ఎక్సైజ్ అధికారిని సారా తయారీ స్థావరాలపై దాడులు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసిసారా తయారి స్థావరాలపై దాడులు చేశారు. 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. రాథోడ్ రాములు, కిషన్, రాథోడ్ సుభాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కార్మికుల జీవితాలకు మరణ శాసనం

ముక్కలవుతున్న వలస జీవుల రెక్కల కష్టం

- కుటుంబ సభ్యులకు ఇప్పటికీ అందని సమాచారం
- కనిపించని సౌత్ గ్లాస్ పరిశ్రమ యాజమాన్యం
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న మిగతా కార్మికులు

షాద్‌నగర్: రెక్కల కష్టాన్ని నమ్ముకొని పరాయి రాష్ట్రం నుంచి వచ్చి ప్రాణాలకు 'తెగి'ంచి పని చేస్తున్న కార్మికులు ఒక్కసారిగా ముక్కలు.. ముక్కలు అయ్యారు. శరీర భాగాలన్నీ చితికిపోయి ఏరుకునే దారుణ పరిస్థితిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ దారుణ మారణకాండకు పరోక్షంగా కారణమైన యాజమాన్యం కంటికి కనిపించకుండా పోయింది. ఇంత దారుణం జరిగినా ఇప్పటి వరకు కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం లేదు. ఇక్కడే పని చేసే మృతుల బంధువులున్నా అదే పరిస్థితి. జేబులో డబ్బులు లేక.. కడుపులో ఆకలిని చంపుకోలేక.. కనిపించని యాజమాన్యం కోసం ఎదురుచూస్తూ దీనంగా కాలం వెళ్లదీస్తున్నారు మిగతా కార్మికులు. షాద్‌నగర్ పరిధిలోని బూర్గుల గ్రామ శివారులో ఉన్న సౌత్ గ్లాస్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన పేలుడు పెను విషాదాన్ని మిగిల్చింది.

ఒత్తిడి ఎక్కువై పేలుడు

వాహనాలకు సంబంధించిన గ్లాస్‌లను సౌత్ గ్లాస్ పరిశ్రమలో తయారు చేస్తున్నారు. పరిశ్రమలోని ఆటో క్లేవ్ యూనిట్‌లో గ్లాస్ తయారైన తర్వాత సాధారణంగా కంప్రెషర్‌పైన ఉండే కీహోల్ దానంతట అదే తెరుచుకుంటుంది. కానీ ఇక్కడ కీహోల్ తెరుచుకోకపోవడంతో ఆటోక్లేవ్ యూనిట్‌లో గ్యాస్, వేడి తీవ్రత పెరిగి ఒత్తిడి ఎక్కువై పేలుడు సంభవించింది. పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులు ఎలాంటి రక్షణ కవచాలను యాజమాన్యం అందించలేదని తెలుస్తోంది. ఈ పేలుడు ఘటనలో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే మృత్యువాత పడగా మరో 13 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.

అయ్యో పాపం..

కంటి ముందు ప్రమాదం జరిగి తమ వారు మృతి చెందినా పరిశ్రమ యాజమాన్యం కనీసం చివరి చూపు చూడనివ్వడం లేదని మృతుల కుటుంబ సభ్యులు వాపోయారు. పరిశ్రమలో ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేశారు. పరిశ్రమ ఆవరణ నుంచి బయటికి వచ్చి పొరుగు రాష్ట్రంలో ఉన్న తమ వారికి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నా సెల్‌ఫోన్‌లలో చార్జింగ్ లేని పరిస్థితి నెలకొందని మృతుల బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం వరకు కూడా మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందలేదని తెలిసింది.

కంటికి కనిపించని యాజమాన్యం

సౌత్ గ్లాస్‌పరిశ్రమలో ప్రమాదం జరిగిన విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్త పడ్డారు. ప్రమాదం జరిగిన రెండు గంటల తర్వాత విషయం బయటకు తెలిసింది. అప్పటికే మృతి చెందిన ఇద్దరిని షాద్‌నగర్‌కు తరలించారు. క్షతగాత్రులను వాహనాల్లో షాద్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తర్వాత కంటికి కనిపించకుండా పోయారు.

కార్మికుల ఆకలి కేకలు

పరిశ్రమలో ప్రమాదం జరిగినప్పటి నుంచి అందులో ఉన్న మిగిలిన కార్మికులకు కనీసం తాగేందుకు నీరు, తినేందుకు భోజనం కరువైంది. పరిశ్రమలో ఘటన జరిగిన తర్వాత అధికారులు, నాయకులు వచ్చి పరిశీలించిన వెళ్లారు. తర్వాత కార్మికులను బయటకు వెళ్లనీయకుండా పరిశ్రమ గేట్లు మూసివేశారు. ఓ వైపు తమ వారు, స్నేహితులు ఏమయ్యారోనని భయంతో, దిగులతో రాత్రంతా జాగారం చేశారు. చివరికి శనివారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినప్పుడు అందులో ఉన్న కార్మికులు తన గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కార్మికులకు భోజన సదుయాన్ని ఏర్పాటు చేశారు. తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.



పరిశ్రమ ఆవరణలో బిక్కుబిక్కుమంటూ నిలుచున్న కార్మికులు

ప్రమాదాలు నిత్యకృత్యం

పారిశ్రామిక ప్రాంతం అయిన షాద్‌నగర్‌లో పరిశ్రమల్లో ప్రమాదాలు నిత్యకృత్యం అయ్యాయి. తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. 2012లో షాద్‌నగర్ శివారులోని స్టీమ్ కోర్ పరిశ్రమలో బాయిలర్ పేలి 12 మంది కార్మికులు మృతి చెందారు. 2015లో కొత్తూరు వినాయక స్టీల్ పరిశ్రమలో ఫర్నస్ పేలి పది మంది మృత్యువాత పడ్డారు. తీగాపూర్ శివారులోని పాత టైర్లను కాల్చే పరిశ్రమలో ప్రమాదం బాయిలర్ పేలి నలుగురు, నందిగామ పరిధిలోని శివశక్తి, జాగృతి, షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద శివారులో ఉన్న స్పాంజ్ ఐరన్ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో పదిమందికి పైగా కార్మికులు మృత్యువాత పడటంతో పాటుగా ఎంతో మంది గాయాలపాలయ్యారు. గత సంవత్సరం జూలైలో కాశిరెడ్డిగూడ గ్రామ శివారులో ఉన్న బ్లైండ్ కలర్ పరిశ్రమలో నలుగురు కార్మికులు మృత్యువాత పడ్డారు. అక్కడక్కడ చిన్న చిన్న పరిశ్రమల్లోనూ ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి.

మృతదేహాన్ని చూపించలేదు



పరిశ్రమలో నాతో పాటు సోదరుడు నిఖిత్ పని చేస్తున్నాడు. పరిశ్రమలో పేలుడు జరగడంతో నిఖిత్ మృతి చెందాడు. యజమానులు కనీసం శవాన్ని కూడా చూపించలేదు. ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు చెబుదామన్నా చార్జింగ్ లేదు.

– సునీల్, కార్మికుడు, సౌత్ గ్లాస్ పరిశ్రమ

బయటకు రాకుండా గేట్లేశారు



పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తమ్ముడు రాంమోరిస్ చనిపోయాడు. శవం ఎక్కడుందో తెలియదు. ప్రమాదం జరిగినప్పటి నుంచి నీళ్లు, తిండి లేదు. రాత్రంతా చీకట్లో ఉపవాసంతో గడిపాం. పరిశ్రమ నుంచి బయటకు వెళ్లనీయకుండా గేట్లు మూసి వేశారు.

– వికాస్, కార్మికుడు, సౌత్ గ్లాస్ పరిశ్రమ

యాజమాన్యం ఆదుకోవాలి



పరిశ్రమలో పేలుడు జరిగినప్పటి నుంచి భయానక వాతావరణం చోటు చేసుకుంది. పరిశ్రమలో ఎక్కడ చూసినా రక్తం మరకలు, శరీర అవయవాలు కనిపిస్తున్నాయి. యజమానులు పత్తాలేరు. పొట్టకూటి కోసం వచ్చిన మమ్మల్ని ఆదుకోవాలి. అధికారులు న్యాయం చేయాలి.

– సుభాష్, కార్మికుడు, సౌత్ గ్లాస్ పరిశ్రమ

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమే



ఉద్యోగ విరమణ పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్లను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీ నారాయణరెడ్డి

- రిటైర్డ్ ఎస్‌ఐలకు ఘన సత్కారం

అనంతగిరి: విధి నిర్వహణలో మనం ప్రజలకు అందించే సేవలే నిలిచిపోతయాని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.హతీరాం, ఎ.నర్సింలు, ఎండీ యూనుస్‌లను శనివారం ఎస్పీ కార్యాలయంలో నారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పదని.. శేష జీవితం ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు కరుణసాగర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వీరేశ్, ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేస్తున్న హెచ్‌ఎంకు సన్మానం

దోమ: ఉద్యోగ విరమణ తర్వాత ప్రతీ ఒక్కరు ఆరోగ్యంగా ఉంటూ కుటుంబంతో సంతోషంగా గడపాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఐనాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు యాదయ్యను సహోద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. ఎంతో మంది విద్యార్థులను ఉత్తములగా తీర్చిదిద్దిన ఘనత యాదయ్యది అన్నారు. పాఠశాలకు ఆయన అందించిన సేవలతో ఎంతో పేరు ప్రఖ్యాతలు వచ్చాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబాచాంద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



దోమ: ఐనాపూర్ ఎంపీపీఎస్ హెచ్‌ఎం యాదయ్యను సన్మానిస్తున్న ఎంఈఓ హరిశ్చందర్

రెండు ద్విచక్రవాహనాలు ఢీ..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చేవెళ్ల: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పామెన గ్రామానికి చెందిన బర్కని కృష్ణ తన టీవీఎస్ ఎక్సెల్‌పై అదే గ్రామానికి చెందిన మంచనపల్లి బాలయ్య(65) ఈ నెల 27న చేవెళ్ల నుంచి గ్రామానికి వెళ్తూ దుర్గాభవాని వైన్స్ వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. అదే సమయంలో షాబాద్ నుంచి చేవెళ్లకు ప్రయాణిస్తున్న యూనికార్న్ బైక్ వేగంగా టీవీఎస్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎక్సెల్‌పై ఉన్న ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో బాలయ్య పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

అనంతగిరి: ప్రేమించిన యువతి దూరమవుతుందని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం వికారాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. పట్టణంలోని ప్రతాప్‌గిరి కాలనీకి చెందిన తరుణ్(20) గతంలో హైదరాబాద్‌లో ప్లంబింగ్ పనిచేసేవాడు. మూడు నెలలుగా వికారాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న సమయంలో ప్రేమించిన యువతిని తనకు దక్కదేమోనని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వృద్ధుడు..



వెంకటయ్య (ఫైల్)

కుల్కచర్ల: బాల్కనీ రెయిలింగ్‌కు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని అంతారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. చౌట వెంకటయ్య(65) ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసుకుని ఉరేసుకున్నాడు. ఆయన మృతికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా..

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్రగాయాలు

కేశంపేట: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న యువకుడు విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని బోధునంపల్లి శివారులో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు క్యామ సాయికుమార్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన వ్యవసాయ క్షేత్రానికి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా రెండు రోజులుగా బోరు మోటార్లకు విద్యుత్ సరఫరా అవ్వడం లేదు. ఇదే విషయమై లైన్‌మెన్ జంగయ్యకు సమాచారం ఇచ్చిన స్పందించ లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫోన్లో సంప్రదిస్తే చౌలపల్లి ఫీడర్ పరిధిలో ఎల్‌సీ ఉందని.. సమస్యను పరిష్కరించుకోండని సూచించాడు. దీంతో సాయికుమార్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అవ్వడంతో విద్యుత్‌షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆయన్ను షాద్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇదే విషయమై ఏఈ ఈశ్వర్‌ను సంప్రదించగా సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ ఇవ్వలేదని.. ఏమైనా రిపేర్లు ఉంటే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇస్తే సమస్య పరిష్కరిస్తారన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరం వద్ద రైతు

కొందుర్గు: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండల పరిధిలోని చెక్కలోనిగూడలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నలమోని ఆంజనేయులు తన ఆవును మేపుతుండగా సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఆవు విలువ సుమారు రూ.95వేలు ఉంటుందని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

అనుమానమే నిజమైంది

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని
- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- నిందితులకు రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ రవిగౌడ్

దౌల్తాబాద్: తన సోదరుడి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణలో మృతుడి అన్న అనుమానమే నిజమైంది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే నెపంతో భార్య తన ప్రియుడితో కలిసి హతమార్చిందని తేలింది. ఎస్‌ఐ రవిగౌడ్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బిచ్చాల గ్రామానికి చెందిన కొరిడె అశోక్, రేణుక దంపతులు. తన భార్యకు గ్రామానికి చెందిన అనిల్‌కు వివాహేతర సంబంధం ఉందని తెలిసి అశోక్ రేణుకను మందలించాడు. అయినప్పటికీ ఆమెలో మార్పు రాలేదు. ఇదే విషయంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని రేణుక ప్రియుడితో కలిసి హత్యకు పథకం వేసింది. ఈ నెల 12న అశోక్ నిద్రించిన సమయంలో రేణుక, అనిల్ ఇద్దరూ దిండుతో ముఖంపై అదిమి పట్టి గొంతు నులిమి చంపారు. ఉదయం 4గంటల సమయంలో తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని చుట్టు పక్కల వారిని నమ్మించింది. 13న అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ నెల 18న తన తమ్ముడి మృతిపై అనుమానం ఉందని మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు శవాన్ని రీపోస్టుమార్టం చేశారు. మృతుడి భార్యను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని అనిల్ తాను హత్య చేసినట్లు నేరాన్ని అంగీకరించింది. దీంతో శనివారం నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

- రేపటి నుంచి స్పెషల్ డ్రైవ్
- మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్



దాబాలో వంట గదిని పరిశీలిస్తున్న బలరాంనాయక్

కొడంగల్ రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతీ ఒక్కరు పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని ఎస్‌వీఆర్ దాబాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి దాబా పరిసరాలను, వంట గదిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి కొడంగల్‌లోని హోటల్స్, తినుబండారాల దుకాణాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మురుగు కాల్వలపై టిఫిన్స్ విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై దృష్టి సారించి కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారస్తులు, కొనుగోలు దారులు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

రెచ్చిపోతున్న అక్రమార్కులు

- కుంట తవ్వి, రాళ్లు ఎత్తుకెళ్తున్న వైనం
- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



పెద్దేముల్ ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

పెద్దేముల్: కుంట కట్టను తవ్వి రాళ్లను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోటపల్లి ప్రాజెక్టు ఇరిగేషన్ ఏఈ నవీన్ శనివారం పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని జనగాం శివారులో నాగిరెడ్డి కుంట ఉంది. సుమారు 50 ఎకరాల ఆయకట్టులో రైతులు వరి సాగు చేస్తున్నారు. గ్రామానికి చెందిన రైతు విజయ్‌కుమార్ గతంలో కుంట కట్టకు గండి వేశాడు. ఇదే విషయమై రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించ లేదు. దీంతో గుట్టు చప్పుడు కాకుండా రాళ్లను తవ్వి తరలించాడు. ఇదే విషయమై జనగాంకు చెందిన పలువురు రైతులు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఇరిగేషన్ ఉన్నతాధికారులు తవ్విన కట్ట వద్దకు, తీసిన రాళ్ల వద్దకు ఎవరూ వెళ్లొద్దని ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ విజయ్ కుమార్ రాళ్లను తీసుకెళ్లి పొలం చుట్టూ ఫెన్సింగ్‌కు వినియోగిస్తున్నారని తెలుసుకున్నారు. ఈ మేరకు శనివారం ఇరిగేషన్ అధికారులు పోలీలకు ఫిర్యదు చేశారు.

ఘనంగా సహజ యోగా మహోత్సవం

హుడాకాంప్లెక్స్: యోగతో సంపూర్ణ ఎదుగుదల సాధ్యమని సహజ యోగ నేషనల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సోనాలి భట్టాచార్య, సహజ యోగ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ అన్నారు. శనివారం హైదరాబాద్ రియలైజేషన్ టూర్ పేరుతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సహజ యోగ మహోత్సవం నిర్వహించారు. సోనాలి భట్టాచార్య ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగ వ్యక్తిగత జీవనశక్తిని విశ్వంతో అనుసంధానం చేయడానికి ఉపయోగపడే సాధనమన్నారు. ఆందోళన, అభద్రతాభావం, కుంగుబాటులు లాంటి సమస్యలు యోగతో పరిష్కరించుకుని సంపూర్ణ జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. యోగ మనందరి దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ నటులు, మాజీ కోఆర్డినేటర్లు మల్లారెడ్డి, రామ్మోహన్ రావు, సుబ్బిరెడ్డి, కమిటీ సభ్యులు సుప్రజ, వినోద్, ప్రమోద్, సునీల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

'ఆయిల్ పామ్'తో లాభాలు అధికం



మాట్లాడుతున్న డాక్టర్ బీఎస్ రావు

డాక్టర్ బీఎస్ రావు

షాద్‌నగర్‌రూరల్: ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించవచ్చునని ఆయిల్‌పామ్ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ బీఎస్ రావు అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ పంచాయతీ కార్యాలయంలో డివిజన్ హెచ్ఓ ఆయిల్ పామ్ సాగుపై అవగాహనచ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఎస్ రావు మాట్లాడుతూ.. దేశ అవసరాలకు సరిపడా ఆయిల్ ఉత్పత్తి చేయాలంటే రైతులు ఎక్కువ మొత్తంలో పంట సాగు చేయాలన్నారు. రైతులు యాజమాన్య పద్ధతులు, మెలకువలను పాటిస్తే ఎకరాకు పది నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఈ పంటను కంపెనీవారే కొనుగోలు చేస్తారన్నారు. ఇతర పంటలతో పోల్చితే చీడపీడల బెడద, కూలీల అవసరం తక్కువగా ఉంటుందన్నారు.

వందశాతం సబ్సిడీ

హార్టికల్చర్ జిల్లా ఏడీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మొక్కలపై 90 శాతం, డిప్పుపై ఐదెకరాల లోపు ఉన్న బీసీ, ఓసీ రైతులను 90శాతం, ఐదు నుంచి 12 ఎకరాలున్న రైతులకు 80శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ప్రతీ ఏడాది ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్ల పాటు మెయింటనెన్స్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భార్గవ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివారెడ్డి, ఆయిల్ పామ్ కంపెనీ ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా ఏరియా మేనేజర్ ప్రమోద్, ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, ఏఈఓ ప్రియాంక, రైతులు తదితరులు పాల్గొన్నారు.